సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 5 । జూలై । 2025



డంపింగ్‌యార్డులో నిరసన

పట్టా భూములను జాయింట్ సర్వే చేసి అప్పగించాలంటూ గిరిజనులు డంపింగ్ యార్డులో నిరసన తెలిపారు. 8లో



ప్రైవేట్ మందులే దిక్కు..

ఏడు నెలలుగా సరఫరా నిలిచిపోవడంతో ప్రభుత్వ పశు వైద్యశాలల్లో మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
32° / 25°

జిల్లాలో శనివారం ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం వరకు ఆకాశం మేఘావృతంగా ఉండవచ్చు.

న్యూస్‌రీల్

స్వర్ణకవచ ధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామివారి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూల విరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్ర పుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: అశ్వారావుపేటలోని ప్రాంతీయ ఆస్పత్రిలో మత్తు వైద్య నిపుణులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్ డాక్టర్ రవిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు ఈనెల 10వ తేదీ లోగా ఐడీఓసీలోని జిల్లా ఆస్పత్రుల ప్రధాన కార్యాలయంలో అందజేయాలని కోరారు. వైద్య నిపుణుడికి నెలకు వేతనం రూ.1.50 లక్షలు చెల్లించనున్నట్లు తెలిపారు.

స్కాట్ మాస్టార్ పోస్టులకు..

పాల్వంచరూరల్: జిల్లాలోని 23 మండలాల పరిధిలో ప్రైవేట్ పాఠశాలలో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన స్కాట్ మాస్టార్లు ఈ నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని స్కాట్ డిస్ట్రిక్ట్ ఆర్గనైజింగ్ కమిషనర్ గద్దల రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులై, 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగిన యువతీ యువకులు స్కాట్ మాస్టార్లుగా అర్హులని పేర్కొన్నారు. పాల్వంచ మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న మహిళాశక్తి హోటల్‌లో దరఖాస్తులు అందజేయాలని, ఎంపికైన స్కాట్ మాస్టార్లకు నెలకు రూ.18 వేల వేతనం ఇస్తారని వివరించారు.

తాలిపేరులోకి వరదనీరు..




ప్రాజెక్టులో చేరిన వరద నీరు

చర్ల: తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్ట్‌లోకి వరద నీరు చేరుతోంది. రెండు నెలలపాటు సాధారణ నిర్వహణ పనులను పూర్తి చేసిన అధికారులు శుక్రవారం ప్రాజెక్ట్ 25 స్పిల్‌వే గేట్లను దించివేశారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో వరదనీరు వస్తుండగా, గేట్లను దించిన దగ్గర నుంచి ప్రాజెక్ట్ నీటిమట్టం పెరుగుతోంది. కనిష్ట నీటిమట్టం 69 మీటర్లు, గరిష్ట నీటిమట్టం 74 మీటర్లు కాగా, గురువారం రాత్రి 10 గంటలకు ప్రాజెక్టు నీటిమట్టం 70.65 మీటర్లుగా నమోదైంది. నాలుగైదు రోజుల పాటు వరద ప్రవాహం కొనసాగితే ప్రాజెక్ట్ నీటిమట్టం పూర్తి స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. డీఈ తిరుపతి, ఏఈలు ఉపేందర్, సుమన శుక్రవారం ప్రాజెక్టును పర్యవేక్షించారు.

కొత్తగూడెం టూ కిరండోల్

కొత్త రైల్వేలైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం

- రెడ్‌కారిడార్‌లో రైల్వే కనెక్టివిటీ పెంపునకు చర్యలు
- కచ్చితమైన సమాచారం కోసం లైడార్ సర్వేకు ఆదేశాలు
- గతంలోనే ఫైనల్ లొకేషన్ సర్వే చేపట్టిన అధికారులు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రైల్వే కనెక్టివిటీ పెంచేందుకు కొత్తగూడెం – కిరండోల్ కొత్త రైల్వేలైన్ నిర్మించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఇందుకోసం ఫైనల్ లొకేషన్ సర్వే చేపట్టాలని గత నెల 28న ఆదేశాలు జారీ చేసింది. కొత్తగూడెం, కిరండోల్ ప్రాంతాల మధ్య 180 కిలోమీటర్ల దూరం ఉంది. ఇందులో కొత్తగూడెం నుంచి పాండురంగాపురం వరకు ఇప్పటికే రైలుమార్గం అందుబాటులో ఉంది. మణుగూరు-భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) సెక్షన్‌లో ఉన్న పాండురంగాపురం నుంచి కిరండోల్ వరకు కొత్తగా 160.33 కిలోమీటర్ల మేర లైన్ నిర్మించాల్సి ఉంటుంది. గోదావరి నదిపై వంతెన నిర్మించడంతోపాటు పాండురంగాపురం రైల్వే స్టేషన్ నుంచి భద్రాచలం వరకు 9.50 కిలోమీటర్ల మేర నూతన మార్గం నిర్మించాల్సి ఉంది. ఆ తర్వాత దుమ్ముగూడెం మండలంలోని రామచంద్రునిపేట, అడవి రామవరంల మీదుగా మరో 12.32 కిలోమీటర్ల రైల్వే లైన్ ఏర్పాటు చేయాలి. అక్కడి నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలోకి ఈ మార్గం ప్రవేశిస్తుంది. గంగ్రేల్, గొల్లపల్లి, చింతల్నార్, నీలంపల్లి , తమోడిల మీదుగా కిరండోల్‌కు ఈ మార్గం చేరుకుంటుంది. 160 కిలోమీటర్ల లైన్‌లో తెలంగాణ పరిధిలో 22 కిలోమీటర్లు ఉండనుంది.

ప్రకటన వచ్చినా నిధులు కేటాయించలే..

భద్రాచలం -మల్కన్‌గిరి (ఒడిశా) కొత్త లైను నిర్మాణానికి రైల్వేశాఖ 2021లో పచ్చజెండా ఊపింది. రెండు పట్టణాల మధ్య 173 కిలోమీటర్ల మేరకు రైల్వేలైను నిర్మించేందుకు 2022 జూన్‌లో ప్రాథమిక సర్వే రిపోర్టు వచ్చింది. ఇందులో ఒడిశా పరిధిలో మల్కన్‌గిరి, బదాలి, కోవాసిగూడ, రాజన్‌గూడ, మహరాజ్‌పల్లి స్టేషన్లు ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో కన్నాపురం, కూటుగుట్ట, పల్లు, నందిగామ స్టేషన్లు ఉన్నాయి. తెలంగాణ పరిధిలో భద్రాచలం, పాండురంగాపురం స్టేషన్లు నిర్మించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ రైలుమార్గం దారిలో గోదావరి, శబరి నదులతోపాటు పలు ప్రాంతాల్లో 213 వంతెనలు నిర్మించాల్సి వస్తుందని తేల్చారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ. 3,592 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఆ తర్వాత రెండేళ్లకు వెనుకబడిన గిరిజన ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ రైల్వేలైనుకు పచ్చజెండా ఊపుతున్నట్టు 2024 ఆగస్టులో కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. కానీ గత రైల్వే బడ్జెట్‌లో ఈ లైనుకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. అదే విధంగా మణుగూరు – రామగుండం, భద్రాచలంరోడ్ – కొవ్వూరు, కొత్తగూడెం – కొండపల్లి రైల్వేలైన్ల పరిస్థితి కూడా సర్వేల దశను దాటి అడుగు ముందుకు పడటం లేదు.

సమగ్ర వివరాల సేకరణ

దేశవ్యాప్తంగా ప్రాథమిక సర్వే రిపోర్టులను పరిశీలించిన రైల్వేశాఖ అందులో ప్రాధాన్యత క్రమాన్ని అనుసరించి ఏ ప్రాజెక్టును నిర్మించాలనే నిర్ణయాన్ని తీసుకుంటుంది. ఫలానా రైల్వే లైను నిర్మించాలని నిర్ణయం తీసుకున్న తర్వాత బడ్జెట్ కేటాయింపునకు ముందు ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్‌ఎల్‌ఎస్)ను చేపడుతుంది. రైలుమార్గం వెళ్లే దారిలో వర్షాల ప్రభావం, వరద, కాంటూరు లెవల్స్, వంతెనలు, కల్వర్టుల నిర్మాణానికి ఎలాంటి డిజైన్ ఉపయోగించాలి? నిర్మాణ ప్రదేశాలకు మ్యాన్ పవర్‌ను ఎలా పంపాలి, వారికి ఎక్కడ బస ఏర్పాటు చేయాలి. నిర్మాణ సామగ్రిని చేరవేయడం ఎలా? అనే ప్రతీ అంశంలో క్షుణ్ణంగా వివరాలను సేకరించి రిపోర్టు తయారు చేస్తారు.

లైడార్ సర్వేకు నిర్ణయం..

ప్రస్తుతం కిరండోల్‌కు విశాఖపట్నం నుంచి మాత్రమే రైలుమార్గం అందుబాటులో ఉంది. ఈ మార్గం నిడివి 440 కి.మీలుగా ఉంది. దీంతో ప్రత్యామ్నాయ మార్గంగా కొత్తగూడెం-కిరండోల్ రైలుమార్గాన్ని నిర్మిస్తామంటూ 2014/15లో బడ్జెట్‌లో రైల్వేశాఖ ప్రకటించింది. ఆ తర్వాత 2018 ప్రాథమిక సర్వే చేపట్టింది. 2023 సెప్టెంబర్‌లో ఫైనల్ లొకేషన్ సర్వే చేపట్టారు. కానీ ఆ తర్వాత ఈ లైను విషయంలో ఉలుకూపలుకు లేకుండా పోయింది. తాజాగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కొత్తగూడెం-కిరండోల్ మార్గం తెరమీదకు వచ్చింది. దీంతో రెండోసారి ఫైనల్ లొకేషన్ సర్వే చేపడుతున్నారు. ఈసారి మరింత కచ్చితమైన సమాచారం కోసం లైడార్ (లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్) సర్వే కూడా చేపట్టాలని నిర్ణయించారు.

బాల్యం వికసించేలా..

- ఆపరేషన్ ముస్కాన్‌తో బాలకార్మికులకు విముక్తి
- ఈ నెల 31 వరకు కార్యక్రమాలు
- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో తనిఖీలు
- గత మూడేళ్లలో 251 మంది గుర్తింపు, సంరక్షణ



కొత్తగూడెంలోని మెకానిక్ షాపులో తనిఖీలు చేపడుతున్న ఆపరేషన్ ముస్కాన్ బృందం (ఫైల్)

కొత్తగూడెంటౌన్: అనాథలు, బాల కార్మికులకు వెట్టిచాకిరీ నుంచి విముక్తి కలిగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఆపరేషన్ ముస్కాన్‌తో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తోంది. బాల కార్మికులను గుర్తించి వారి భవిష్యత్‌కు అండగా నిలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాల కార్మికుల కోసం ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాలు చేపడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2022 నుంచి 2025 వరకు దాదాపుగా 251 మంది బాల కార్మికులను గుర్తించి విముక్తి కలిగించినట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనినా తెలిపారు. హోటళ్లు, బట్టల షాపులు, ఇటుకల నిర్మాణ, భవన నిర్మాణ ప్రదేశాలు, బేకరీలు, సినిమాహాళ్లతోపాటు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతూ బాలకార్మికులను గుర్తిస్తున్నారు. జిల్లా సంక్షేమ, పోలీసు, రెవెన్యూ, కార్మిక శాఖలు, బాలల సంరక్షణ బృందాలు, చైల్డ్‌లైన్(1098), బాలల సంక్షేమ సమితి, ప్రత్యేక బాలల విభాగం, జాతీయ బాల కార్మిక విభాగాల సమన్వయంతో సబ్ డివిజన్ల వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తూ బాలకార్మికులను రక్షిస్తున్నారు. చిన్నతనంలోనే తల్లిదండ్రుల ఆలనాపాలనకు నోచుకోని పిల్లలు, తప్పిపోయిన పిల్లలు, అనాథలు, బాల కార్మికులుగా దుర్భర జీవితం సాగిస్తున్న చిన్నారులకు ఆపరేషన్ ముస్కాన్‌తో భరోసా కల్పిస్తున్నారు. 18 ఏళ్లలోపు బాలబాలికలతో పనులు చేయిస్తున్నవారిపై చర్యలు తీసుకుంటున్నారు. సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఏటా జూలై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్, జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గుర్తించిన బాల కార్మికులకు సమగ్ర బాలల పరిరక్షణ పథకం కింద బాల సహాయక కిట్లు ఇవ్వడంతోపాటు సంరక్షణ బాధ్యతలను ప్రభుత్వమే పర్యవేక్షిస్తోంది.

బాలలతో పనులు చేయించడం నేరం



బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ఈ నెల 1 నుంచి ఆపరేషన్ ముస్కాన్ చేపడుతున్నాం. 31వ తేదీ వరకు తనిఖీలు కొనసాగిస్తాం. బాలబాలికలతో పనులు చేయిస్తే కేసులు నమోదు చేస్తాం. బాల కార్మికులను గుర్తించి వారికి విద్య నేర్పించేందుకు కృషి చేస్తాం. బాలకార్మికులతో ఎవరైనా పనులు చేయిస్తే 1098కు సమాచారం ఇవ్వాలి.

స్వర్ణలత లెనినా, జిల్లా సంక్షేమశాఖ అధికారి

గత మూడేళ్లలో విముక్తి కల్పించిన బాలల వివరాలు

ఏడాది	ఆపరేషన్	బాలురు	బాలికలు	మొత్తం
2022	స్మైల్	30	05	35
2022	ముస్కాన్	56	12	68
2023	స్మైల్	22	09	31
2023	ముస్కాన్	28	05	33
2024	స్మైల్	14	07	21
2024	ముస్కాన్	21	02	23
2025	స్మైల్	33	07	40
మొత్తం		204	47	251

పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య



తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్యకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ జితేష్ తదితరులు

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో దొడ్డి కొమరయ్య వర్ధంతి నిర్వహించారు. తొలుత కొమరయ్య చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాటం చేసిన మహనీయుడు కొమరయ్య అని కీర్తించారు. తెలంగాణ సాయుధ పోరాటం పేరు వినగానే మొదట గుర్తుకు వచ్చేది దొడ్డి కొమరయ్య పేరని వ్యాఖ్యానించారు. దొరల దురాగతాలను ఎదిరించిన గొప్ప వీరుడని కొనియాడారు.

మాజీ సీఎం రోశయ్యకు నివాళి

బహుముఖ ప్రజ్ఞాశాలి మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మాజీ ముఖ్యమంత్రి, మాజీ తమిళనాడు గవర్నర్ రోశయ్య జయంతి నిర్వహించారు. మొదట రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ పనినైనా నిబద్ధతతో చేసే ఆయన ముఖ్యమంత్రిగా, ఆర్థిక మంత్రిగా రాష్ట్రానికి విశేష సేవలందించారని కొనియాడారు. అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, క్రీడల అధికారి పరంధామరెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిర, కలెక్టరేట్ ఏఓ అనంత రామకృష్ణ, బీసీ సంక్షేమాధికారి ఇందిర, కురుమ సంఘం సభ్యులు దూడల బుచ్చయ్య, లింగయ్య, రవికుమార్, చంద్రశేఖర్, దూడల కిరణ్, సుంక ప్రవీణ్, కోటిలింగం, సంపత్ కుమార్, కె.రవి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీఓ

ఐటీడీఏలో..

భద్రాచలం: మాజీ ముఖ్యమంత్రిగా కొణిజేటి రోశయ్యకు ఐటీడీఏలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. పీఓ బి.రాహుల్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీఓ ఆలయ పరిసరాల్లో భక్తులు బస చేసే, భక్తులు వచ్చే పలు ప్రదేశాలను సందర్శించారు. రామాలయం, అన్నదాన సత్రం, గోదావరి కరకట్ట, ఇతర ప్రదేశాలను పరిశీలించారు. ఆ తర్వాత మాట్లాడుతూ శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులు ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియానికి సులువుగా చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంబేద్కర్ సెంటర్‌లోని మహనీయుల విగ్రహాలను సందర్శించి, మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో డేవిడ్ రాజ్, మణెమ్మ, హరీష్, భాస్కర రావు, ఉదయ్ కుమార్, రమేష్, వేణు, లక్ష్మీ నారాయణ, ప్రభాకర్ రావు, హరికృష్ణ, ఆదినారాయణ, అలివేలు మంగతాయారు, శ్రీనివాస్, రవీందర్, వెంకటేశ్వర్లు, వీరభద్రం పాల్గొన్నారు.

చేప చెరువుకు చేరేనా?

- ఊసేలేని ఉచిత చేప పిల్లల పంపిణీ ప్రక్రియ
- ప్రతిపాదనలు కూడా రూపొందించని అధికారులు
- జిల్లావ్యాప్తంగా నిరీక్షిస్తున్న మత్స్యకారులు



చేప పిల్లలను చెరువులో వదులుతున్న మత్స్యకారులు(ఫైల్)

పాల్వంచరూరల్: ఉచిత చేప పిల్లలు ఈసారి చెరువులకు చేరే పరిస్థితి కన్పించడంలేదు. జూలైలో చేప పిల్లలను చెరువులో వదిలితే మత్స్యకారులు ఉపాధి, ఆదాయం పొందుతారు. కానీ చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలూ రాకపోవడంతో జిల్లా మత్స్యశాఖ అధికారులు ప్రతిపాదనలు కూడా పంపలేదు. జిల్లాలో గతేడాది 734 చెరువుల్లో చేప పిల్లలను వదిలారు. ఆలస్యంగా పంపిణీ చేయడంతోపాటు కేవలం 86 లక్షల చేపపిల్లలను మాత్రమే చెరువుల్లో వదిలి చేతులు దులుపుకున్నారు. ఈసారి సీజన్ ప్రారంభమైనా పంపిణీ ప్రక్రియపై అధికారుల నుంచి స్పష్టత లేకపోవడంతో మత్స్యకారులు నిరీక్షిస్తున్నారు.

734 చెరువులు, కుంటల్లో పెంపకం

జిల్లాలో చేపలు పెంచే చెరువులు, కుంటలు 734 ఉన్నాయి. 70 మత్స్య పారిశ్రామిక సొసైటీల ఆధ్వర్యంలో పెంపకం చేపడుతున్నారు. వీటిల్లో 3,248 మంది సభ్యులు ఉండగా, చేపల పెంపకం ద్వారా సుమారు 10 వేల మంది ఉపాధి పొందుతున్నారు. గతేడాది 86 లక్షల చేప పిల్లలను, అంతకుముందు సంవత్సరం 1,93,76,000 చేప పిల్లలను చెరువుల్లో వదిలారు. ఈసారి పంపిణీ ఊసేలేదు.

కిన్నెరసానిలో ఉత్పత్తి కేంద్రం..

కిన్నెరసానిలో మత్స్యశాఖ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో చేప గుడ్లు(స్పాన్) పోసి రెండు నెలలపాటు పెంచి గిరిజన మత్స్యకార సొసైటీలకు ఉచితంగా పంపిణీ చేస్తారు. 20 లక్షల చేప పిల్లలను పెంచేలా ఇక్కడ 13 తొట్లు నిర్మించగా, ప్రస్తుతం కొన్ని మాత్రమే పనిచేస్తున్నాయి. గతేడాది 12 లక్షల చేప పిల్లలను మాత్రమే పెంచారు. ఈసారి మాత్రం గుడ్లు ఇంతవరకు పోయలేదు.

గుడ్లు తీసుకురావాల్సిఉంది



ప్రభుత్వం ప్రతిపాదనలు అడిగితే జిల్లాలో 1.75 కోట్ల చేప పిల్లల పంపిణీ కోసం సిద్ధం చేసి పంపిస్తాం. కిన్నెరసాని ఉత్పత్తి కేంద్రానికి చేప గుడ్లను కరీంగనగర్ నుంచి తేవాల్సి ఉంది.

–ఇంతియాజ్ అహ్మద్, జిల్లా మత్స్యశాఖ అధికారి

సమయం దాటితే..

చేప పిల్లలను సీజన్ ప్రారంభంలో చెరువుల్లో వదిలితే 8,9 నెలల్లో చేపలు పెరిగి ఆశించిన దిగుబడి లభిస్తుంది. కానీ అదును దాటాక చేప పిల్లలను పోసినా ఉపయోగం ఉండదు. ఆలస్యమైతే చేపలు ఎదగపోవడంతోపాటు దిగుబడి తగ్గుతుంది. సాధారణంగా జూలైలో 50, 60 రోజుల చేప పిల్లలను చెరువుల్లో వదులుతారు. ఫిబ్రవరి, మార్చి నాటికి చేప ఎదుగుతుంది. దీంతో మత్స్యకారులకు ఉపాధి లభిస్తుంది. కానీ ఈ ఏడాది ఇప్పటివరకు చేప పిల్లల పంపిణీకి ప్రతిపాదనలే రూపొందించలేదు. గుడ్లు తెచ్చి పిల్లల పెంపకం చేపట్టలేదు. జూలై తర్వాత పిల్లలను కొనుగోలు చేసి వదిలినా చేప ఎదిగే అవకాశం ఉండదు. మార్చి నాటికి చెరువుల్లో నీటిమట్టం కూడా తగ్గిపోతుందని, ఈ ఏడాది ఉచిత చేప పిల్లలు లేనట్టేనని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు.



చేప పిల్లలు

ఆదివాసీల సంక్షేమానికి కృషి

కొత్తగూడెంఅర్బన్: ఆదివాసీ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని గంగమ్మ కాలనీ గొత్తికోయ గ్రామంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. పిల్లలకు విద్య నేర్పిస్తే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వర్షాకాలంలో ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం 27 కుటుంబాలకు దుప్పట్లు, దోమ తెరలను పంపిణీ చేశారు. విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్ సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం మద్దె గుంపునుకు చేరుకుని అక్కడ నివసిస్తున్న ఆదివాసీ ప్రజల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జి.నరేందర్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎస్సైలు రమణారెడ్డి, కార్తీక్, లక్ష్మీదేవిపల్లి పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.



దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు తదితరులు

సింగరేణిలో 21 మంది అధికారుల బదిలీ



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 21 మంది ఫైనాన్స్ అధికారులను బదిలీ చేస్తూ కార్పొరేట్ ఈఈ సెల్ హెచ్‌వోడీ ఏజీ మురళీధర్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీఅయిన వారిలో డీజీఎం, ఫైనాన్స్ మేనేజర్, ఇద్దరు డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్లు, 8 మంది సీనియర్ అకౌంట్ ఆఫీసర్లు, నలుగురు మేనేజ్‌మెంట్ ట్రైనీలు, ఐదుగురు జూనియర్ అకౌంట్ ఆఫీసర్లు ఉన్నారు. వీరందరూ ఈ నెల 12వ తేదీలోగా కేటాయించిన ఏరియాల్లో బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రామాలయంలో సెక్యూరిటీ పటిష్టం

మెటల్ డిటెక్టర్ల ఏర్పాటు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో సెక్యూరిటీ వ్యవస్థను మరింత పటిష్టం చేశారు. రెండు డోర్ ఫ్రేమ్‌లను, మెటల్ డిటెక్టర్, ఆరు హ్యాండ్ హోల్డ్ మెటల్ డిటెక్టర్లను కొనుగోలు చేసి శుక్రవారం ఆలయంలో అమర్చారు. ఎస్పీఎఫ్ సిబ్బంది భక్తులను తనిఖీ చేసి అనుమతించారు. ఈఈ రవీందర్ పర్యవేక్షించారు.

వస్త్ర దుకాణ టెండర్‌దారుడికి రూ.లక్ష జరిమానా

అన్యమత ప్రచారం చేసే కవర్లను దేవస్థానంలో వినియోగించినందుకు దేవస్థానం అధికారులు వస్త్ర దుకాణ టెండర్‌దారుడికి రూ.లక్ష జరిమానా విధించారు. నెల రోజుల క్రితం ఆంధ్రాకు చెందిన ఓ భక్త జంట స్వామివారి వస్త్రాలను ఆలయ ప్రాంగణంలో కొనుగోలు చేయగా, వాటిని ఆ దుకాణదారుడు ఓ కవర్‌లో పెట్టి ఇచ్చారు. పరిశీలించగా కవరుపై అన్యమత ప్రచారం ఉంది. ఆ దంపతులు ఈఓకు ఫిర్యాదు చేయగా, ఏఈవో శ్రవణ్‌కుమార్‌ను విచారణకు ఆదేశించారు. ఆయన విచారించి ఇచ్చిన నివేదిక ఆధారంగా, దేవాదాయ శాఖ నిబంధనలను అతిక్రమించి అన్యమతం ప్రచారం చేసినందుకు ఈఓ రూ.లక్ష జరిమానా విధించారు.



డోర్‌ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ ద్వారా వెళ్తున్న భక్తులు

క్లుప్తంగా

సజావుగా ఆరోగ్య కార్యక్రమాల అమలు


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ జయలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాలను సజావుగా అమలు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జయలక్ష్మి సూచించారు. శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆమె ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తలతో మాట్లాడారు. నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు, సికిల్ సెల్ అనీమియా కోసం కమ్యూనిటీ స్క్రీనింగ్‌పై దృష్టి సారించాలని, శిశువులకు యాంటెనటల్ కేసుల నమోదు చేయాలని, రోగనిరోధక కవరేజీని వందశాతం సాధించాలని తెలిపారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ స్పందన, డాక్టర్ పుల్లారెడ్డి, సీహెచ్ఓ నాగభూషణం, బి.సోమ్లా నాయక్, జిల్లా స్థాయి పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఫోన్లు తనిఖీ.. పోలీసులకు ఫిర్యాదు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా కార్మిక సంఘాల నేతల ఫోన్లు విజిలెన్స్ బృందం తనిఖీ చేసిన విషయమై ఓ కార్మిక సంఘం నేత పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం పోలీసులు అటు కార్మిక సంఘాల నేతలను, సింగరేణి ఎస్అండ్‌పీసీ నేతలను పోలీస్ స్టేషన్‌కు పిలిచి వాకబు చేశారు. రెండు రోజుల కిందట రాత్రి సమయంలో డ్యూటీలో ఉన్న ఇద్దరు వేర్వేరు కార్మిక సంఘాల నేతల ఫోన్లు సింగరేణి విజిలెన్స్ విభాగం టీంసభ్యులు తనిఖీ చేశారు. ఓ నేత ఫోన్ నుంచి డేటా డౌన్‌లోడ్ చేసుకున్నట్లు తెలిసింది. ఈ తరుణంలో డ్యూటీలో ఉన్న తన ఫోన్ అనుమతి లేకుండా స్వాధీనం చేసుకుని తనిఖీ చేయడంపై సదరు నేత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు రహస్యంగా సింగరేణి అధికారులను విచారిస్తున్నారు.

చేయూత పెన్షన్లపై అవగాహన


మాట్లాడుతున్న సెర్ప్ డైరెక్టర్ గోపాలరావు

చుంచుపల్లి: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోస్టల్ అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, బిల్ కలెక్టర్లకు చేయూత పెన్షన్లపై శుక్రవారం ఐడీఓసీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భర్త/భార్య చనిపోతే భాగస్వామి పెన్షన్ పొందడం, పెన్షన్ డ్రా చేయని ఖాతాలు, చనిపోయిన వారి పేర్లను తొలగించటం, పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణ వంటి అంశాలపై సెర్ప్ డైరెక్టర్ గోపాలరావు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఎం విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, డీపీఓ చంద్రమౌళి, సెర్ప్ అదనపు డీఆర్‌డీఓ నీలేష్, సిబ్బంది కె.చంద్రశేఖర్, రవి, లోకేష్ పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో ఆర్టిజన్‌కు కరెంట్ షాక్

పాల్వంచ: కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో ఓ ఆర్టిజన్ కార్మికుడు విద్యుదాఘతానికి గురైన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు.. సీతారాంపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో పనిచేసే ఆర్టిజన్ కార్మికుడు ఆర్.కాంతారావు కేటీపీఎస్ కర్మాగారంలో స్విచ్ యార్డ్ వద్ద 220 కేవీ లైన్ జంపర్లను కలిపేందుకు గురువారం రాత్రి వెళ్లాడు. ఈ క్రమంలో ఇండక్షన్ జరిగి కరెంట్ షాక్‌కు గురై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. తోటి కార్మికులు సీఆర్‌పీ చేసి కేటీపీఎస్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కొత్తగూడెం తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తోటి కార్మికులు తెలిపారు.

వైద్యం వికటించిందని ఆందోళన


చేతులు చూపిస్తున్న బాధితురాలు అరుణ

పాల్వంచ: వైద్యం వికటించిందని బాధితురాలు ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట బైఠాయించి ఆందోళన నిర్వహించింది. బాధితురాలి కథనం ప్రకారం.. వికలాంగులకాలనీకి చెందిన భూక్యా అరుణ శాస్త్రీ రోడ్ రెండోబజార్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి నీరసంగా ఉందని చెప్పడంతో వైద్యుడు రెండు చేతులకు క్యాన్‌లా పెట్టారు. అనంతరం చేతులు రెండు వాచిపోయి గడ్డలు వచ్చాయి. దీంతో కొత్తగూడెం ఆస్పత్రికి వెళ్లగా వైద్యం వికటించిందని, ఆపరేషన్ చేయాలని చెప్పారు. అందుకు రూ.లక్ష వరకు ఖర్చు అయింది. ఇంకా చికిత్స అందించాల్సి ఉందని తెలపడంతో ఇచ్చే స్తోమత లేదని వాపోయారు. అందుకు కారణమైన పాల్వంచ ఆస్పత్రికి అరుణ కుటుంబ సభ్యులు వచ్చి బైఠాయించి ఆందోళన తెలిపారు. దీంతో ఆస్పత్రి వైద్యులు పరారయ్యారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు వచ్చిందని, పరిశీలిస్తున్నామని తెలిపారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.17,463

ప్రైవేట్ మందులే దిక్కు..

- పల్లెల్లో కానరాని పశువైద్యం
- మందుల కొరతతో తీవ్ర ఇబ్బందులు
- ఏడు నెలలుగా నిలిచిన సరఫరా
- ప్రైవేట్‌లో మందులు కొంటేనే పశువులకు వైద్యం


బూర్గంపాడు ప్రభుత్వ పశు వైద్యశాలలో అరకొరగా ఉన్న మందులు


పశువులకు వైద్యం చేస్తున్న వైద్యాధికారులు

బూర్గంపాడు: జిల్లాలో పశువైద్యం ప్రైవేట్‌లో మందులు కొంటేనే సాధ్యపడుతోంది. ప్రభుత్వ పశు వైద్యశాలల్లో మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. జిల్లాలోని పశు వైద్యశాలలకు ఏడునెలలుగా మందుల సరఫరా నిలిచిపోయింది. గత నవంబర్‌లో వచ్చిన మందులే తప్ప ఇంతవరకు సరఫరా జరగలేదు. పశువులకు ఏదైనా రోగమొచ్చినా, ఏదైనా ప్రమాదం జరిగి గాయపడినా పశు వైద్యశాలల్లో మందులు లేవు. దీంతో పశువుల పెంపకందారులు ప్రైవేట్ మందుల దుకాణాల్లో మందులు కొనుక్కుంటేనే వైద్యం అందించే పరిస్థితులున్నాయి.

పశువులకు వ్యాధులు

వానాకాలంలో పశువులకు ఎక్కువగా గొంతువాపు, జబ్బవాపు, గురక జబ్బులు వస్తుంటాయి. వీటి నివారణకు పశు సంవర్ధకశాఖ ముందస్తుగానే వ్యాక్సినేషన్ కార్యక్రమాలు చేపడుతుంది. జీవాలలో ఈ సీజన్‌లో చిటుకు రోగం ఎక్కువగా వస్తుంటుంది. వాటికి కూడా ముందస్తుగా వ్యాక్సిన్లు వేయాలి. గుడ్డిలో మెల్లగా వ్యాక్సిన్లు మాత్రం ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంటున్నాయి. యాంటీ బయాటిక్స్, సపోర్టింగ్ మందులతో పాటుగా సెలైన్‌లు, క్లీనింగ్ మందులు, కాటన్ వంటివి బయట కొనుగోలు చేయాల్సి వస్తోందని పశువుల పెంపకందారులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా..

పశు వైద్యశాలల్లో మందుల కొరతతో సకాలంలో వైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడుతున్న ఘటనలు ఎదురవుతున్నాయి. కనీసం నట్టల నివారణ మందులు కూడా పశు వైద్యశాలల్లో లేవంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

రెండేళ్లుగా నట్టల మందులు కరువు..

జిల్లాలో 2.12లక్షల గేదెలు, ఆవులు ఉన్నాయి. సుమారు 3.25లక్షల మేకలు, గొర్రెలున్నాయి. ఇవి కాకుండా పందులు, పెంపుడు కుక్కలు కూడా వేల సంఖ్యలోనే ఉన్నాయి. పశువులకు, జీవాలకు వైద్య సేవలు అందించేందుకు జిల్లాలో 80 ప్రభుత్వ పశు వైద్యశాలలున్నాయి. పశువులకు వైద్యం చేసేందుకు డాక్టర్లు, వైద్యసిబ్బంది అందుబాటులో ఉన్నారు. అయితే పశువుల ఆస్పత్రులకు మందుల కొరత తరచుగా వేధిస్తోంది. వర్షాకాలం పశువులు, జీవాలలో కూడా అనారోగ్య సమస్యలు ఉంటాయి. సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలుతాయి. ఈ తరుణంలోనే పశువులకు, జీవాలకు ప్రభుత్వపరంగా వ్యాక్సినేషన్ కార్యక్రమాలు ఎక్కువగా చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలోని పశువైద్యశాలల్లో యాంటీ బయాటిక్స్ కొరత ఎక్కువగా ఉంది. వ్యాధుల నివారణకు యాంటీ బయాటిక్స్‌తో పాటుగా బలానికి ఇచ్చే సపోర్టింగ్ మందులు (విటమిన్, మినరల్స్) కూడా అందుబాటులో లేవు. అనారోగ్యంతో ఆస్పత్రులకు తీసుకువచ్చిన పశువులకు తక్షణ శక్తి కోసం ఇచ్చే సెలైన్ బాటిళ్లు కూడా లేకపోవటం ఇబ్బందికరంగా మారింది. మేకలు, గొర్రెలకు మూడు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందులు వేయాల్సి ఉంటుంది. అయితే రెండేళ్లుగా నట్టల నివారణ మందుల సరఫరా లేకపోవటంతో జీవాల పెంపకందారులు ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. కనీసం నట్టల నివారణ మందులు కూడా లేకపోవటం ప్రస్తుత దుస్థితికి అద్దం పడుతోంది. వైద్యం కోసం పశువుల పెంపకందారులు ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తే మందుల చీటీ రాయించుకుని ప్రైవేట్ దుకాణాల్లో డబ్బులు పెట్టి కొనుక్కుంటేనే వైద్యం చేసే పరిస్థితులున్నాయి.

మందులు ఉండటం లేదు

పశువుల ఆస్పత్రికి ఎప్పుడు వెళ్లినా మందులు లేవంటున్నారు. యాంటీ బయాటిక్స్ బయట కొనుక్కుంటేనే వైద్యం చేస్తున్నారు. మినరల్స్ ప్యాకెట్లు కూడా లేవని ఇవ్వటం లేదు. పశువుల ఆస్పత్రికి పశువులను తీసుకెళ్లాలంటే జేబులో డబ్బులుండాల్సిందే.

–భూక్యా రాములు, రైతు, నాగినేనిప్రోలు

ఉన్నతాధికారులకు నివేదించాం

పశువుల ఆస్పత్రుల్లో మందుల కొరత వాస్తవమే. మందుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. ఈ నెలలోనే మందులు వచ్చే అవకాశాలున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతోంది.

–డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తత అవసరం

భద్రాచలంఅర్బన్: ఆదివాసీ గిరిజనులు ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి, వైద్యశిబిరాలు నిర్వహించాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ రాజీ అన్నారు.
శుక్రవారం కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ వ్యవహారాల కార్యాలయం (న్యూఢిల్లీ) నుంచి వీసీ ద్వారా రాష్ట్రాల వారీగా గిరిజన గ్రామాల్లో ఉంటున్న గిరిజన కుటుంబాల ప్రజలు ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడకుండా చేపట్టాల్సిన కార్యాచరణపై సమీక్షించారు. తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధులు వయసుతో సంబంధం లేకుండా అందరికీ సోకుతాయన్నారు. ప్రతి గిరిజన గ్రామంలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించి చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతీ ఒక్కరి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపాలని చెప్పారు. తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా ఉన్నట్లు నిర్ధారణ అయితే ఆయా గ్రామాల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించి అందరికీ రక్త పరీక్షలు నిర్వహించి, అవగాహన కల్పించాలని తెలిపారు. చిన్నారులు, గర్భిణుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా, భద్రాచలం పరిధిలో ఉన్న పీహెచ్‌సీల్లో వైద్యుల కొరతతోపాటు ఇతర మౌలిక వసతులపై ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ వివరించారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, ప్రోగ్రాం అధికారి రాము పాల్గొన్నారు.

సెర్ప్ సీసీ మృతికి సంతాపం


పైడిపల్లి మురళీ కృష్ణ (ఫైల్)

పాల్వంచరూరల్: స్థానిక సెర్ప్ కార్యాలయంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్‌గా 23 ఏళ్లుగా పనిచేస్తూ.. కాంట్రాక్టర్‌కాలనీలో నివాసం ఉంటున్న పైడిపల్లి మురళీకృష్ణ (54) కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ శుక్రవారం మృతిచెందాడు. ఆయన మృత దేహాన్ని ఎంపీడీఓ కె.విజయభాస్కర్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం రాంబాబు, ఏపీఓరంగా, మహిళా సంఘాల సభ్యులు సందర్శించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


వాంకుదోత్ వినోద్‌కుమార్ మృతదేహం

ఇల్లెందురూరల్: మండలంలోని మామిడిగూడెం గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వాంకుడోత్ వినోద్ (35) మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. బోయితండా పంచాయతీ లక్ష్మీనారాయణతండాకు చెందిన వాంకుడోత్ వినోద్, అదే గ్రామానికి చెందిన ప్రేంకుమార్ బైక్‌పై ఇల్లెందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో మామిడిగూడెం వద్ద ఎదురుగా వచ్చిన ఆటోను తప్పించబోయి నేరుగా చెట్టుకు ఢీకొన్నారు. ప్రమాదంలో వినోద్ అక్కడికక్కడే మృతి చెందగా ప్రేంకుమార్‌కు గాయాలయ్యాయి. ఇతడిని స్థానికులు ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

నానో యూరియాతో సత్ఫలితాలు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు

ఇల్లెందురూరల్: సత్వర ప్రయోజనం అందించే నానో యూరియా వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు సూచించారు. ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న యూరియా విక్రయ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు ఇల్లెందుకు చేరిన యూరియా, విక్రయం, ప్రస్తుతం ఉన్న నిల్వల వివరాలు తెలుసుకున్నారు. విక్రయ కేంద్రం వద్ద ఉన్న రైతులతో మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో లక్ష ఎకరాల వరకు మొక్కజొన్న సాగయ్యే అవకాశం ఉందన్నారు. జిల్లాలో యూరియా నిల్వలు సరిపడా ఉన్నాయని, రోజూ 40 టన్నుల యూరియా ఇల్లెందుకు రవాణా అవుతోందని తెలిపారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీవో శ్రీనివాస్, ఏడీఏ లాల్‌చంద్, ఏవో సతీష్, పీఏసీఎస్ సీఈవో హీరాలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

అపస్మారక స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి


చికిత్స పొందుతున్న వ్యక్తి

ఇల్లెందురూరల్/ఇల్లెందు: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామ పంచాయతీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రెండు రోజులుగా అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఇల్లెందు పోలీసులు అతన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు 87128 2070 నంబర్‌లో సంప్రదించాలని ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

900 గ్రాముల గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న 900 గ్రాముల గంజాయిని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు. ఎస్ఐ సంధ్య ఆధ్వర్యాన తనిఖీలు చేస్తుండగా.. కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన అబ్దుల్ మోహిత్ గంజాయి అమ్ముతూ కొత్త బస్టాండ్ సమీపంలోని గుట్టపై పట్టుబడ్డాడు. ఆయన నుంచి రూ.30 వేల విలువైన 900 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకోవడమే కాక కొనుగోలుకు వచ్చిన గోపాలపురం, జహీర్‌పురవాసులు బాదావత్ ప్రవీణ్, దూర్ సందీప్, దోస్వాన్ సాయివినయ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక సీజ్

పాల్వంచ: అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. పట్టణ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన లారీ ఇసుకను రెవెన్యూ ఆర్ఐ రవికుమార్ సీజ్ చేశారు. అనంతరం ఇసుకను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

కాంట్రాక్టర్స్‌కాలనీలో చోరీ?

పాల్వంచ: పట్టణంలోని కాంట్రాక్టర్స్‌కాలనీలో ఓ ఇంట్లో పట్టపగలు చోరీ జరిగినట్లు సమాచారం. స్థానికుల కథనం మేరకు.. ఓ మహిళ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తి చొరబడి ఒంటిపై ఉన్న బంగారు నగలు తీసుకెళ్లినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయమై ఎస్ఐ సుమన్‌ను వివరణ కోరగా.. ఘటనపై విచారిస్తున్నామని తెలిపారు.

ఒక్కటే గుక్క.. ఊపిరి తీసింది..

మృత్యువుతో పోరాడి ఓడిన బాలుడు వరుణ్ తేజ


వరుణ్ తేజ మృతదేహం


వరుణ్ తేజ (ఫైల్)

కరకగూడెం: శీతలపానియం సీసా కనిపిస్తే తీసుకుని ఒక్క గుక్క వేశాడు.. అంతే అదే ఆ బాలుడి ప్రాణాలు బలికొంది. అందులో ఉన్నది పురుగులమందు అని తెలియక తాగిన బాలుడు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి తనువుచాలించాడు. మండలంలోని చొప్పల గ్రామానికి చెందిన జాడి నవీన్, వరలక్ష్మి దంపతుల రెండో సంతానం వరుణ్ తేజ (5) గత నెల 29న ఇంట్లో ఆడుకుంటున్న సమయంలో తన తండ్రి గ్రామంలో ఓ వ్యక్తి అడిగాడని ఖాళీ శీతలపానియం సీసాలో గడ్డిమందు పోసి ఇంటి ముందు పెట్టి ఊర్లోకి వెళ్లాడు. అది చూసిన వరుణ్ తేజ తాగాడు. కొన్ని క్షణాల్లోనే తీవ్రమైన కడుపునొప్పితో విలవిల్లాడిపోయాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. పలువురు దాతలు కూడా ఆర్థిక సాయం చేశారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి వరుణ్ తేజ తుది శ్వాస విడిచాడు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదం నింపింది.

రేషన్ బియ్యం పట్టివేత

జూలూరుపాడు: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ బాదావత్ రవి కథనం ప్రకారం.. సుజాతనగర్ మండలం చింతలతండాకు చెందిన మాలోత్ వినోద్‌కుమార్ జూలూరుపాడు మండల పరిసర ప్రాంత గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలుచేసి, అధికధరకు అమ్ముకుంటున్నాడు. గుండ్లరేవు గ్రామం నుంచి వినోద్‌కుమార్ తన ట్రాలీలో రేషన్‌బియ్యాన్ని సుజాతనగర్ వైపు తరలిస్తుండగా భేతాళపాడు వద్ద పోలీసులు పట్టుకున్నారు. 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం, ట్రాలీని స్వాధీనం చేసుకుని, వినోద్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని, బియ్యం విలువ సుమారు రూ.11,000 ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవి పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

బూర్గంపాడు: మండల కేంద్రంలోని ముదిరాజ్‌బజార్‌కు చెందిన నీరుడు సంధ్య (38) శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సంధ్య తీవ్ర మనోవేదనకు గురవుతోంది. కుటుంబసభ్యులు పలు ఆస్పత్రుల్లో చూపించారు. శుక్రవారం భర్త శేషయ్య పనులకు వెళ్లిన తరువాత సంధ్య ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఇద్దరు కుమారులు చంద్రశేఖర్, లోకేశ్ ఉన్నారు. మృతురాలి చెల్లెలు మేకల లీలావతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు.. మండలంలోని సీతారాంపురం శివారు వాగు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందగా శుక్రవారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా ఇసుక తోలుతున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీఎల్‌యూడీ పద్ధతిలో బయోచార్ తయారీ

కలెక్టర్ జితేశ్ వి.పాటిల్


బయోచార్‌యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

సుజాతనగర్: టీఎల్‌యూడీ (టాప్ లిట్ అప్‌డ్రాఫ్ట్) పద్ధతిలో నాణ్యమైన బయోచార్ తయారు చేయవచ్చని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. మండలంలోని వేపలగడ్డకు చెందిన కుందూరు లక్ష్మీనారాయణరెడ్డి వెల్డింగ్ దుకాణంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన బయోచార్ యూనిట్ ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా 30 కిలోల వేస్ట్ కట్టె ముక్కలను చిన్నచిన్న ముక్కలుగా చేసి మండించడం ద్వారా 10 కిలోల నాణ్యమైన బయోచార్‌ను కలెక్టర్ తయారు చేయగలిగారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఇలా తయారైన బయోచార్‌ను ఆవుపంచకం (ఆవుపేడ మొదలైనవి)తో కలిపి కొన్ని రోజులు నిల్వ ఉంచి ఆరబెట్టి, పొడిగా చేసి పంటలకు ఎరువుగా ఉపయోగించాలని సూచించారు. జిల్లాలోని రైతువేదికల ద్వారా బయోచార్ తయారీ విధానం గురించి రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో విరివిగా లభించే తుమ్మ చెట్టు కొమ్మలు, రహదారులు, కరెంట్ తీగలకు అడ్డంగా ఉన్న కొమ్మలను ఉపయోగించి తక్కువ ఆక్సిజన్‌లో టీఎల్‌యూడీ పద్ధతిలో బయోచార్ తయారు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలు బయోచార్ తయారు చేసి, విక్రయించడం ద్వారా లాభం పొందొచ్చని సూచించారు. బయోచార్ తయారీ సమయంలో ఉత్పన్నమయ్యే వేడిని ఎలా ఉపయోగించుకోవచ్చో, బయోచార్ తయారీ విధానాన్ని మరింత తక్కువ ఖర్చుతో, సులభతరంగా రైతులు ఉపయోగించుకునేలా రూపొందించడానికి వివిధ పద్ధతులను పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీడీ విద్యాచందన, ఎంపీడీఓ బి.భారతి, ఏఓ నర్మద తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డులో గిరిజనుల నిరసన


నిరసన తెలుపుతున్న గిరిజనులు

అశ్వారావుపేటరూరల్: తమ పట్టా భూములను జాయింట్ సర్వే చేసి అప్పగించాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు వినూత్నంగా ఓ డంపింగ్‌యార్డులో నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని రామన్నగూడేనికి చెందిన 150 మంది గిరిజనులకు సర్వే నంబర్లు 30,36, 39లో 573 ఎకరాలకు సంబంధించి తమ పూర్వీకుల నుంచి పట్టాలు కలిగి ఉన్నారు. కాగా, ఈ భూములు కొన్నేళ్లుగా అటవీ, ఎఫ్‌డీసీ ఆధీనంలో ఉండగా ఆయా భూముల్లో టేకు, వెదురు ప్లాంటేషన్లు ఉన్నాయి. ఈ భూములను నాటి ఉమ్మడి జిల్లా కలెక్టర్‌తోపాటు హైకోర్టు పూర్వ పట్టాలు ఉన్న గిరిజనులకు సర్వే చేసి అప్పగించాలని 13 ఏళ్ల కిందటే ఉత్తర్వులు జారీ చేశారు. కానీ, ఈ భూములను జాయింట్ సర్వే చేసేందుకు రెవెన్యూ, ఫారెస్టు, ఎఫ్‌డీసీ అధికారులు ముందుకు రాకపోవడంతో ఏళ్లుగా గిరిజనులు తమ భూములు అప్పగించాలని దశలవారీగా పోరాటాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం కూడా రామన్నగూడెం పంచాయతీ డంపింగ్ యార్డులో బాధిత గిరిజనులు తమ వద్ద ఉన్న పూర్వ పట్టాలను చేతుల్లో పట్టుకొని గంటపాటు నిరసన వ్యక్తం చేసి, జాయింట్ సర్వే చేయాలని డిమాండ్ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

విత్తన చాలెంజ్‌లో సత్తా

విజేతగా నిలిచిన హనుమాతండా పాఠశాల


హనుమాతండా ఎంపీపీఎస్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కాంప్లెక్స్ హెచ్ఎం

టేకులపల్లి: కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఇచ్చిన విత్తన చాలెంజ్ కార్యక్రమంలో మండలంలోని పాఠశాలలు సత్తా చాటాయి. 13 కేజీల 985 గ్రాముల విత్తనాలు సేకరించి సులానగర్ కాంప్లెక్స్‌లోని హనుమాతండా ఎంపీపీఎస్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఎంఈఓ అజ్మీర జగన్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. టేకులపల్లి కాంప్లెక్స్‌లో 4 కేజీల 600 గ్రాములతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సులానగర్ కాంప్లెక్స్‌లో 13 కేజీల 985 గ్రాములతో ఎంపీపీఎస్ హనుమాతండా, బొమ్మనపల్లి కాంప్లెక్స్‌లో కేజీతో ఎంపీపీఎస్ బొమ్మనపల్లి, ముత్యాలంపాడు కాంప్లెక్స్‌లో 4 కేజీల 900 గ్రాములతో ఎంపీయూపీఎస్ తావుర్యాతండా, బోడు కాంప్లెక్స్‌లో 2 కేజీల 900 గ్రాములతో ఎంపీపీఎస్ బర్లగూడెం, కుంటల్ల కాంప్లెక్స్‌లో 4 కేజీలతో ఎంపీపీఎస్ దాసుతండా పాఠశాలలు విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు, విజేత పాఠశాలల హెచ్ఎంలు మోహన్‌రావు, దేవదాసు, మంగీలాల్, రామచంద్రసింగ్, అజ్మీర జగన్‌నాయక్, స్వర్ణలత, పద్మ, జైల్‌సింగ్, రమేశ్‌బాబు, విజయనిర్మల పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ డైరెక్ట్10th, Inter, (వయస్సు18) Degree(All) PG(All) అడ్మిషన్ గైడెన్స్, డిప్లొమో, B.Tech, M.Tech, DBM ఫార్మసీ, M.Phil, Phd, BAMS, BHMS, BUMS. 8143100455, 8074482366 [G-233]

DISTANCE EDUCATION
■ మావద్ద ఓపెన్ 10th ఇంటర్, డిగ్రీ, పీజీ, MBA, MCA, B.Tech, LLB, ITI, డిప్లొమా, ఫార్మసి, B.Sc, (Agree), HPT, B.Ed, B.PEd, అడ్మిషన్లకై సం.ప్ర. 99481 31154 [SCA 25005912]

Real Estate

PLOT FOR SALE
■ ఖమ్మం హైటెక్ సిటీ, తల్లంపాడులో కట్టబోతున్న ఐ.టి. హబ్, త్రి స్టార్ హోటల్, స్కూల్, క్లబ్ హౌస్, జిమ్, E.V ఛార్జింగ్ సౌకర్యాలతో గల ప్రాజెక్టులో DTCP ప్లాట్లు ఫర్ సేల్. సం॥ కాట్రపల్లి నాగరాజ్, ఖమ్మం 93993 42239 [SCA 25005672]

Services

BUSINESS OFFER
■ Need Monthly Returns ? Get your own International Capital Market Trading Account. Profit Sharing / Fixed Returns. Safe and Secure. 6301859174 [SCA25005884]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

BUSINESS Wanted

■ ఖమ్మంలోని ప్రముఖ సంస్థలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ వెంటనే కావలెను. జీతం 12-14 వేలు. సం.ప్ర. 70361 91924, 95050 82812 [SCA 25005859]

■ ఖమ్మం లోకల్ నందు సెక్యూరిటీ గార్డ్స్ సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, హౌస్ కీపింగ్ స్టాఫ్ & వార్డ్ బాయ్స్ కావలెను. జీతం 10-15 వేలు ESI+PF కలదు. సం.ప్ర. 9441683688, 7997241854 [SCA 25005810]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9848571888, 9640400073 [SCA25005909]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

■ రామకృష్ణ ఓల్డేజ్‌హోం నాగోల్ Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవ వంట/ఇంటిపని బేబీకేర్ కై M/F వర్కర్స్ కా॥ భో+వసతి + జీతం: 16-18 వేలు ఏజెంట్లకు 5వేలు కమీషన్ ఫోన్ : 9281465319, 9010680011 [SCA25005822]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9010299957, 9705444182
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642
మధిర : 9949927792